# చిట్టిరోజా

-సత్యవాడ సోదరీమణులు

"అన్నయ్యా! అమ్మెప్పుడొస్తుంది" రోజా నోట పదే పదే అదే ప్రశ్న. రాజేంద్ర నవ్వుకున్నాడు.

"వస్తుందిలే మనల్ని ఇక్కడే ఉండమంది"

"మరి రాత్రయిపోయిందిగా" తన చేతికున్న వాచీలో ఏడుగంటలు చూసుకుంటూ అంది.

"ఎన్నిసార్లు చెప్పాలి. మీ చెల్లాయిని హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. దాని దగ్గర ఎవర్నయినా ఉంచి మీ అమ్మ రావాలి. ఇలా విసిగిస్తే ఎలా?" కసురుకున్నాడు.

"సారీ అన్నయ్యా. ఇంక నీకు కోపం తెప్పించనులే."

"గుడ్‌గర్ల్. నేనేమిచ్చినా తినను అనేస్తున్నావు. నాకేమో ఆకలి దంచేస్తోంది. ఏదైనా తిని ఇప్పుడే వచ్చేస్తా" అంటూ చకచకా బయటకు నడిచాడు.

కోపం తెప్పించను అని మాటిచ్చేసింది కనుక తమాయించుకుంది కానీ ఒక్కదాన్నీ ఉండలేను నన్ను నీతో తీసుకెళ్లవూ అనాలనిపించింది.

రోజాకి పరిస్థితి అంతా అయోమయంగా ఉంది. తను స్కూలుకెళ్లేదాకా చెల్లాయితో ఆడుకుంది. అమ్మకి కాస్త జ్వరంగా ఉండి కాలేజీకి లీవు పెట్టింది. అమ్మ ఇంట్లోనే ఉండగా బుజ్జి ఎక్కడ ఆటలాడింది? అంత పెద్ద దెబ్బ ఎలా తగిలించుకుంది? దెబ్బ తగిలితేనే హాస్పిటల్‌లో జాయినైపోవాలా? అమ్మెందుకిలా చేసిందో? స్కూలుకొచ్చి టీచర్ని పర్మిషన్ అడిగి తననీ తీసుకెళ్లిపోతే బావుండేది. బుజ్జిని చూడాలని, అమ్మతోపాటు తనూ దాని దగ్గర ఉండాలని అమ్మెందుకు అనుకోలేదు? పోనీ ఇంటితాళం అన్నయ్యతో పంపించి ఇంట్లోనే ఉండమన్నా సరిపోయేది. పక్కింటి ఆంటీ అంకుల్ వాళ్ల పిల్లలతో సరదాగా గడిచిపోయేది. అమ్మ ఎంత రాత్రి వచ్చినా భయమే లేకపోను. అలా చేయకుండా ఈ రాజేంద్రన్నయ్య రూంలో కూర్చోమంది. ఈ అన్నయ్యతో తనకేమంత పరిచయం ఉందని? అమ్మ దగ్గర పాఠాలు చెప్పించుకోవడానికి వచ్చినప్పుడల్లా చిట్టి చెల్లాయి, బుజ్జి చెల్లాయి అంటూ తమిద్దర్నీ ముద్దుచేసి చాక్లెట్టిస్తాడు. చాలారోజులనుండి ఇంటికే రావడం మానేసిన రాజేంద్రన్నయ్య ఇవ్వాళ స్కూలుకొచ్చి మీ అమ్మ చెప్పిందంటూ తన రూమ్‌కు తీసుకొచ్చేసాడు. ఛ... ఇక్కడేం బాలేదు. చీదరగా అనిపించి బాత్రూంకెళ్లి ముఖం కడుక్కుని పౌడరు అద్దుకుంది. తన స్కూలు బ్యాగు అల్మారాలో పెడుతుంటే పిల్లల కథల పుస్తకం దొరకడంతో దాన్ని తిరగేస్తూ కూర్చుంది.

***

ఫైవ్‌స్టార్ హోటల్‌లో విలాసంగా కూర్చుని చికెన్ బిర్యానీ లాగించేస్తున్నాడు రాజేంద్ర. తను అనుకున్నది అనుకున్నట్లు చేసి తీరుతాడు. అందుకు కావాల్సిన బలం, పౌరుషం తక్షణం తనకి వచ్చేయాలి. అందుకోసమేగా నాలుగు కోటాలు కూడా పట్టించేసాడు. దెబ్బతో పగ తీర్చుకునే శక్తి తనకి వచ్చేయదూ. క్రోధం, ద్వేషం నిండిన మనసుతో ఆవేశంగా రూమ్‌కి చేరుకున్నాడు.

తలుపు తెరిచిన రోజా ఒక్కసారిగా దడుచుకుంది. నోరు పెగల్చుకుని ఏదో అడగబోయింది. 'అన్నయ్యా' అని అనేలోగానే రోజాని చుట్టేసి హత్తుకున్నాడు. ఆ పసిమొగ్గ బెదిరిపోయింది.

"ఏమిటన్నయ్యా వదులు. అమ్మ వచ్చేదాకా నీ రూంలో ఉండమందని తీసుకొచ్చి ఏదో పిచ్చి పనులు చేస్తున్నావేంటి?" అతని చేతుల్లోంచి అతి ప్రయత్నంమీద వదిలించుకుని రెపరెపలాడుతున్న మనసుతో గోడకు అతుక్కుపోయి ఓ మూలగా నిలబడింది. రాజేంద్ర మనసు పొగలు, సెగలు కక్కుతూనే వుంది. నేను చేస్తున్నది పిచ్చి పనేంకాదు. ఆవిడగారికే పట్టింది గొప్ప పేరు తెచ్చుకోవాలనే పిచ్చి. ఆ పిచ్చి ఈరకంగా వదిలిస్తాను. పట్టుమని పదేళ్ళు కూడా నిండకుండానే పతనమైపోయిన కూతుర్ని చూసుకుని బ్రతికినంత కాలం కుళ్లి కుళ్లి ఏడవవలసిందే. మరింత విసురుగా వెళ్లి రోజాని వడిసి పట్టుకున్నాడు.

"అన్నయ్యా" అంటూ ఏడ్వసాగింది.

"ఏడుస్తావెందుకు? ఇదంతా సరదా. మనం ఈరాత్రి తమాషా ఆటలాడుకుందాం. ఆటలాడడానికెవరైనా ఏడుస్తారా? నేనేం చేస్తున్నా నువ్వు కిల కిలా నవ్వుతూ నాతో జట్టుగా ఉండాలి మరి. తెలిసిందా?" అంటూ మళ్లీ గాఢంగా హత్తుకున్నాడు.

అతని కడుపులో ఒక్కసారిగా దేవినట్టయింది. మద్యం, మాంసం అతనెప్పుడూ ఇంతగా తీసుకోలేదు. భళ్ళున వాంతి చేసుకున్నాడు. అప్పటిదాకా బెదురుచూపులతో బిత్తరపోయిన రోజా చప్పున మంచినీళ్ళు తెచ్చి తాగించింది. ఎడతెరపిలేని వాంతులు, విరోచనాలతో సతమతమైపోతున్న రాజేంద్రకి చిట్టిరోజా ఎన్నో సేవలందించింది. మంచంమీద పడుకున్న అతనికి ఏదో మత్తు కమ్మేస్తున్నట్లుగా ఉంది. కాసేపట్లో తాను స్పృహ కోల్పోతాడా? హఠాత్తుగా వచ్చిన ఈ బాధతో తన ప్రాణం పోతుందా? అనుకుంటున్నాడు.

"ఇప్పుడెలా అన్నయ్యా... ఏం చేసేది? అమ్మో నువ్వేమైపోతావో" అంటూ బిగ్గరగా ఏడ్చేసింది.

రాజేంద్ర గుండెల్లో ఏదో తడి. ఈ పసిపాపని తనేం చేయాలనుకున్నాడు? నిష్కల్మషమైన మనసుతో ఈ చిన్నారి తనకోసం ఏడుస్తోందే? వెక్కిళ్ళు పెడుతూనే తన ఒంటిమీద చేయివేసి "అమ్మో జ్వరం కూడా వచ్చేసింది. ఇప్పుడెలా?" అంటోంది బేలగా.

అతనిలోని పశుత్వం పటాపంచలైంది.

"చెల్లెమ్మా" అంటూ లేవబోయాడు.

"వద్దు. నువ్వు లేచి రాలేవులే. దగ్గర్లో డాక్టరెవరైనా ఉండకపోరు. బ్రతిమాలి నేనే తీసుకొస్తాను" అని ఆ పిల్ల అనడం లీలగా తెలుస్తోంది. ఇంత రాత్రి చిన్నపిల్లవి నీవల్లేమవుతుంది. ఎక్కడికీ వెళ్లొద్దమ్మా అనబోయిన అతని పెదవులు కదల్లేదు. రోజా తుర్రున బయటకి పరుగెత్తడం మసకగా కనిపించింది.

***

తనెవరూ కానీ అతనికోసం రోజా ఆరాటపడుతుంటే తన ప్రాణానికి ప్రాణమైన కూతురు ఏమైపోతుందా అని తల్లడిల్లిపోతోంది శ్యామల.

బుజ్జిని నిద్రపుచ్చుతూ తనూ నిద్రలోకి జారుకున్న శ్యామలకి జ్వర తీవ్రతవల్లనేమో ఆరు దాటే వరకూ మెలకువ రాలేదు. ఈసరికే రోజా వచ్చేయాలే... పక్కింటి పిల్లలతో ఆడుకుంటూ వుండి వుంటుంది. పాపం పిలిచే వుంటుంది. పాడు నిద్ర. తనని తాను తిట్టుకుంటూ ప్రక్కవాటాలోకెళ్లిన శ్యామల హతాశురాలైంది. పాప స్కూలు నుంచే రాలేదన్న విషయం తట్టుకోలేకపోతోంది. మతి చలించినదానిలా స్కూలుకి పరుగెత్తింది.

"ఒక కుర్రాడొచ్చి మీరే రమ్మన్నారని మీ పాపని తీసుకెళ్లాడమ్మా" స్కూలు వాచ్‌మెన్ చెప్పాడు.

మొదలు నరికిన చెట్టులా ఆ గేటుముందే కూలబడిపోయింది. ఖచ్చితంగా ఇది రాజేంద్ర పనే. తనమీదనున్న కక్షను పసిపాప మీద తీర్చుకుంటున్నాడన్నమాట. రోజానేం చేస్తాడో? దానికేమైనా అయితే తను బ్రతగ్గలదా? మూడు పదులు నిండకుండానే భర్తని పోగొట్టుకున్నా తన పిల్లలే తన సర్వస్వంగా పెంచుకొస్తోంది. భగవంతుడా! ఇలా జరిగిందేమిటి? తనేం పాపం చేసింది? తన విధిని తను నిర్వర్తించింది. నైతిక విలువలు కోసం పోరాడటమే తన తప్పా? యువత పెడదారి పట్టకూడదని సక్రమ మార్గంలోనే విద్యను సముపార్జించాలని, అప్పుడే భావితరాలు బాగుపడతాయని భావించిందేతప్ప రాజేంద్ర మీద తనకేం కసిలేదే! ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకి ఇన్విజిలేటర్‌గా వేసారు తనని. కాపీ కొడుతూ పట్టుబడిపోయాడు రాజేంద్ర. ఓ క్షణం బెదురుచూపులు చూసి "మేడం! మీ తమ్ముడిలాంటివాడ్ని. ప్లీజ్ వదిలేయండి" ఆమెకే వినిపించేలా ప్రాధేయపడ్డాడు.

"అక్కగానే చెప్తున్నాను రాజేంద్రా! నువ్వు మంచి మార్గంలో నడవాలి. నిన్నసలు విడిచిపె



**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది పోటీలో ఎంపికైన కథ**

ట్టను. నెక్స్ట్ టైం బెటర్‌లక్" అనేసి ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసింది.

అవమానంతో కుతకుతలాడిన రాజేంద్ర ఆ రాత్రి తన ఇంటిముందు నిల్చుని నోటికొచ్చిందల్లా తిట్టాడు. ఓర్పుతో భరించి శాంతంగా నచ్చచెప్ప బోతే మరింత రెచ్చిపోయాడు.

"నీ పని పడతా చూడు. నిన్నెలా దెబ్బతీస్తానో ఊహించలేవు" అంటూ తనని ఉరిమి చూస్తూ వెళ్లిపోయాడు.

ఇవేమీ తెలియని రోజా అమాయకంగా వాడివెంట వెళ్లింది.

రాజేంద్ర తన బిడ్డను ఊరికే వదలడు. ఇక తన చిట్టితల్లి తనకి లేనట్టేనా? ఇప్పుడు తనేం చేయాలి? దిక్కుతోచక కుమిలిపోతున్న శ్యామలకి ప్రాణస్నే హితురాలు ప్రమీల గుర్తుకొచ్చింది. శక్తినంతా కూడదీసుకుంటూ ఆమె ఇంటికి ఎలా వచ్చి పడిందో ఆమెకే తెలీదు.

భోరుమని ఏడుస్తూ జరిగినదంతా ఆమెకు చెప్పింది. ఆమె సలహాతో పోలీసు రిపోర్టు ఇచ్చినా దేవునిమీద భారంవేసి స్థిమితంగా ఉండలేకపో యింది. శ్యామల అవస్థ చూడలేని ప్రమీల రాజేంద్రతో కాస్త పరిచయమున్న తన తమ్ముడికి ఫోన్ చేసి రప్పించింది. ప్రశాంత్ వచ్చేసరికి అర్ధరాత్రి దాటినా ముగ్గురూ ఇరుకు సందులు తిరుగుతూ రాజేంద్ర ఉండే రూమ్ వెదకసాగారు. తెల్లవారుతుండగా ప్రశాంత్ "ఇదే అక్కయ్యా రాజేంద్ర రూం" అంటూ ఓ ఇంట్లోకి దారి తీసారు.

ఓరగా వున్న తలుపు తోసేసరికి వారికంటపడిన దృశ్యం ఆ ముగ్గుర్నీ నిశ్చే ష్టుల్ని చేసింది. వళ్ళు తెలియకుండా మంచంమీద రాజేంద్ర మూలుగుతు న్నాడు. అతని వంటిపై డ్రాయర్ తప్ప ఇంకేమీలేదు. చన్నీటిలో బట్ట ముంచి కండలు తిరిగిన అతని శరీరాన్ని చిట్టి రోజా తుడుస్తోంది.

"నా బంగారు తల్లీ ఇదంతా ఏమిటమ్మా?" చప్పున కూతుర్ని దగ్గరకు తీసుకుంది.

ఆ చల్లని చేయి దూరం కావడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచిన రాజేంద్ర శ్యామలని చూస్తూనే శక్తినంతా కూడదీసుకుని దిగ్గునలేచాడు. "నన్ను క్షమిం చండి మేడం" అంటూ ఆమె కాళ్లమీద పడ్డాడు.

"అన్నయ్యా! నువ్వెందుకు లేచావు. ఈ మాత్ర వేసుకుని పడుకో" అంటూ టాబ్లెట్, మంచినీళ్ళు అతనికి అందించింది.

తను చేయబోయిన అత్యాచారం, ఈ చిన్నారి పంచిన ప్రేమామృతం ఒక దానికొకటి భిన్నధృవాలే అన్న తలపు రాజేంద్ర మనసుని పిండేస్తోంది.

"మిమ్మల్ని ఏడిపించాలని రోజానిలా తీసుకొచ్చేసాను. దిద్దుకోలేని తప్పుడు పని చేయబోయాను. కానీ నన్నిలా మంచాన పడేసి రోజాని ఆ దేవుడు కాపాడాడు. చేయబోయిన నా తప్పుకు నన్ను మీరు మన్నించలేరు. మీరు నాకు ఏ శిక్ష విధించినా సంతోషంగా అనుభవిస్తాను. నన్ను క్షమించండి మేడమ్" రుద్దమైన కంఠస్వరంతో పదేపదే అంటున్నాడు.

"పశ్చాత్తాపానికి మించిన శిక్షలేదు. ప్రతీకార వాంఛ, ఆవేశం మనిషిని రాక్ష సుడిలా మారుస్తాయి. వాటికి నీ మనసులో చోటివ్వనప్పుడు నువ్వు ఎవ్వరికీ ఏ హానీ తలపెట్టలేవు" అనేసి గభాలున కూతుర్ని ఎత్తుకుంది.

ఇంతలో ఆత్రంగా లోపలికొచ్చాడు డాక్టర్ మూర్తి.

"హమ్మయ్య... పెద్దవాళ్ళు వచ్చేసారుకదా. పేషెంట్ దగ్గర పసిపిల్ల మాత్రమే ఉంది. ఇతగాడికేం ప్రమాదం ముంచుకొస్తుందో అని తెల్లవారకుం డానే మళ్లీ వచ్చాను" అంటూ రాజేంద్రని పరీక్షిస్తూ "గండం గడిచింది. నిజంగా ఈ చిన్నారి సహాయంతోనే ఈ పిల్లాడు బ్రతికి బయటపడ్డాడు" అన్నాడు డాక్టర్.


"నా ఒక్కదానివల్ల కాదు. మీరే ఎంతో మంచివాళ్లంకుల్. నేను పిలవగానే మీరు రాకపోతే పాపం అన్నయ్యకేమయ్యేదో. ఇప్పుడైతే మమ్మీ, ఆంటీ కూడా వచ్చేసారు" అంది రోజా.

"ఈ బంగారు కొండని కన్నది నువ్వా అమ్మా! ఎంత మంచి పెంపకం తల్లీ నీది. మీ అమ్మాయిలో నేనొక ఫ్లారెన్స్ నైటింగేల్‌ని, మరో మదర్ థెరిస్సాని చూసాను. అర్ధరాత్రి పూట మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. ఇతగాడి ప్రాణాలు కాపాడింది. ఈ లేత మనసుకు ఎలాంటి మలినం అంటకుండా ఇలాగే పెంచమ్మా. ప్రేమరాహిత్యం, హింసా ప్రవృత్తి విలయతాండవం చేస్తున్న ఈ సమాజానికి వీళ్ల అవసరం ఎంతైనా వుంది" శ్యామలవైపు అన్నాడు డాక్టర్.

ఆ మాటలు చెవినపడ్డ రాజేంద్ర చలించిపోయాడు. తన చేతుల్లో ఒక నైటింగేల్‌లా, ఒక మదర్ థెరిస్సాగా రేకు విచ్చుకుంటున్న చిట్టి రోజా మొగ్గ గానే నలిగిపోయేదా?

నా చిన్నారి చెల్లిని చక్రం అడ్డువేసి ఆపద నుంచి గట్టెక్కించినందుకు నీకు జన్మాంతం కృతజ్ఞుడనై ఉంటాను. ఆ గదిలో గోడకు అమర్చి వుంచిన దైవానికి నమస్కరిస్తూ అనుకున్నాడు రాజేంద్ర.

★



## ఇమేజ్ చట్రం

హీరోలు తమ ఇమేజ్ ఛట్రం నుంచి బయటపడితేనే విజయాలబాట పడతారని తమిళ హీరోలు నిరూపించారు. అందుకేనేమో ఇప్పుడు జగప తిబాబు ఈ బాటలోనే నడవాలనుకుంటున్నట్టు ఉన్నాడు. బ్రహ్మాస్త్రం సిని మాతో బిజీగా ఉన్న జగపతిబాబు ఇప్పుడో కొత్త చిత్రం గురించి ఆలోచి స్తున్నాడు. ఈ చిత్రంలో జగపతిబాబు విలన్‌గా నటించనున్నట్టు విశ్వస నీయ వర్గాల కథనం. ఈ చిత్రానికి శశాంక్ హీరోగా వ్యవహరిస్తున్నారు.

